దివ్యాంగుల జీవితాలతో 'సదరం'గం

- అనర్హత ముసుగులో అడ్డగోలుగా పింఛన్ల తొలగింపు
- దశాబ్దాలుగా లబ్ధి పొందుతున్న వారికి నోటీసులు
- మండలంలో దాదాపు 300 మంది సదరం క్యాంపుకు వెళ్లాలని ఆదేశం
- ఆవేదన చెందుతున్న దివ్యాంగులు


పింఛన్ల తొలగింపుపై అప్పీల్ చేసుకునేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన దివ్యాంగులు

ఓర్వకల్లు: గత ఎన్నికల ముందు.. తాము అధికారంలోకి వస్తే అన్ని కేటగిరీల పింఛన్లు పెంచుతామని కూటమి నేతలు ప్రచారం చేశారు. చెప్పిందే తడవుగా తమ పింఛన్లు పెరిగితే మందుల ఖర్చులకు పనికొస్తుందని, సమాజంలో ఆత్మగౌరవం పెరగడమేగాక కుటుంబంలో మరింత ఆదరణ లభిస్తుందని భావించిన పింఛన్‌దారులు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్‌దారుల ఏరివేతకు పూనుకొంది. ఇందులో భాగంగా తొలుత వృద్ధాప్య పింఛన్లపై వేటు వేసింది. తాజాగా దివ్యాంగులకు జీవనాధారమైన పింఛన్లలో అనర్హత ముసుగులో అడ్డగోలు తొలగింపులకు పాల్పడుతోంది.

అనర్హత ముసుగులో అడ్డగోలు నోటీసులు

మండలంలో సుమారు 990 మంది దివ్యాంగులు పింఛన్లు పొందుతుండగా, వాటిలో దాదాపు 140 మంది దివ్యాంగులకు ఇక మీదట పింఛన్లు తీసుకోవడానికి మీరు అనర్హులు అని పేర్కొంటూ వారం, పది రోజుల క్రితం అధికారులు అడ్డగోలుగా నోటీసులు జారీ చేశారు. మీరందరూ మరోసారి సదరం శిబిరానికి వెళ్లి తమ వికలత్వాన్ని నిరూపించుకోవాలని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఎంపీడీఓ కార్యాలయాలకు వరుస కడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా 1వ తదీనే వలంటీర్ల సాయంతో నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పింఛన్లు అందజేసేవారు. దీంతో తమకు ఎలాంటి ఢోకాలేదని పింఛనుదారులు నిశ్చింతంగా ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దివ్యాంగులకు వైకల్య శాతాన్ని మరోసారి నిర్ధారించుకోవాలని అధికారులు పేర్కొనడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. గతంలో వైద్యులు ధ్రువీకరించిన వైకల్య శాతంలో సగటున 25 శాతం తగ్గించడంతో దివ్యాంగులను సర్వత్రా ఆందోళనకు గురిచేస్తుంది.

అవిటితనంతో అవస్థలు పడుతున్నా కనికరించరు



కన్నమడకల గ్రామానికి చెందిన అయ్యమ్మ పుట్టుకతోనే మూగ, చెవుడుతో బాధపడుతుంది. ఈమెకున్న అవిటితనంతో ప్రభుత్వం వారు దివ్యాంగ పింఛన్ మంజూరు చేశారు. ప్రస్తుతం ఈమెకు ప్రతి నెలా రూ.6 వేల పింఛన్ వస్తుంది. దీంతో కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలిచింది. ఇటీవల ఆమెకు వైకల్య శాతం తక్కువగా ఉందని, పింఛన్‌కు అర్హురాలు కాదని పేర్కొంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. పింఛన్‌తో ఇంతకాలం నెట్టుకొచ్చిన ఆమె ఇకపై పింఛన్ రాకుంటే ఎలా? అని ఎవరికీ చెప్పుకోలేక తనలో తానే కుమిలిపోతోంది.

– అయ్యమ్మ, కన్నమడకల గ్రామం

20 ఏళ్లుగా ఉన్న పింఛన్ కట్



ఈమె పాలకొలనుకు చెందిన ఆవుల చిన్నమ్మ పుట్టుకతోనే మూగ, చెవుడుతో బాధపడుతోంది. ఆమెకున్న అవిటితనం బట్టి దివ్యాంగ పింఛన్ మంజూరు కాగా 20 ఏళ్ల నుంచి పింఛన్ తీసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఈమెపై దయాదాక్షిణ్యాలు చూపాల్సింది పోయి, నిర్దాక్షిణ్యంగా వైకల్య శాతం తక్కువగా ఉందని నోటీసు ఇవ్వడంతో ఏం చేయాలో అర్థం గాక తల్లడిల్లుతోంది.

– ఆవుల చిన్నమ్మ, పాలకొలను గ్రామం

పింఛనే జీవనాధారం



మాది నిరుపేద కుంటుంబం, తల్లితండ్రులు పనికి వెళితేగానీ కుటుంబం గడవని పరిస్థితి. పుట్టుకతోనే వింత చర్మ వ్యాధితో బాధపడుతున్నాను. గత ఐదేళ్ల నుంచి పింఛన్ తీసుకుంటున్నాను.కుటుంబానికి పింఛన్ ఎంతో ఆసరాగా నిలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్నఫలంగా పింఛన్ తొలగిస్తే ఏం చేయాలో అర్థం కావడంలేదు. మాలాంటి నిరుపేద కుటుంబాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పింఛన్ పునరుద్ధరించాలి.

– కానుగల లల్లీ, శకునాల గ్రామం

దివ్యాంగులపై కక్షగట్టిన ప్రభుత్వం


మెడికల్ రీవెరిఫికేషన్ చేయించుకోవాలని ఇచ్చిన నోటీసు


గతంలో వంద శాతం మూగ ఉన్నట్లు ఇచ్చిన సర్టిఫికెట్

గడివేముల: పింఛను పించుతామంటూ వృద్ధులు, దివ్యాంగులు, వింతంతులు, అనారోగ్యులను ఏమార్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారి నోటి కాడి కూడు లాగేస్తోంది. గత ప్రభుత్వంలో దివ్యాంగ పింఛన్లు పొందిన వారిని అనర్హులుగా పేర్కొంటూ ఏరివేతకు పూనుకొంది. మంచానికే పరిమితమైన వారిని కూడా వదలకుండా వారి కడుపు కొడుతోంది. సరికొత్త నిబంధనలు. తెరపైకి తీసుకొచ్చి పింఛన్లలో కొర్రిలు పెడుతోంది. మీ వైకల్య అర్హతను నిరూపించుకోవాలని మరి కొంత మందికి నోటీసులు అందిస్తోంది. రూ.15 వేలు పొందుతున్న పింఛన్‌ను రూ.6 వేలకు తగ్గిస్తోంది. ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్న వారి పింఛన్లను ఇతర కేటగిరీలోకి మార్పు చేస్తూ తీరని వేదన మిగులుస్తోంది. కూటమి ప్రభుత్వ చర్యలతో దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్న ఆర్థిక ఆసరాను లాగేస్తే తామెలా బతకాలంటూ కన్నీరు మున్నీరవుతున్నారు. అయినా ప్రభుత్వం కనికరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పింఛన్లు భారీగా తగ్గించుకునేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.

139 పింఛన్లు తొలగింపు

పింఛన్ల ఏరివేతలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన రీవెరిఫికేషన్‌లో అర్హులైన చాలా మది అనర్హుల జాబితాలో చేరిపోయారు. మండల పరిధిలోని గ్రామాల్లో 139 వివిధ రకాల పింఛన్లను తొలగించినట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్తా తెలిపారు. ముఖ్యంగా దివ్యాంగులు, మానసిక రోగులకు సంబంధించిన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు సరిగా లేనందున తొలగించినట్లు వివరించారు. మండలంలో వికలాంగ, మానసిక రోగులు తదితరులు 407 మంది ఉన్నారు. సర్టిఫికెట్లు సరిగా ఉన్న వారు 268 మాత్రమే ఉన్నారన్నారు. బిలకలగూడూరు 15, బూజునూరు 6, చిందుకూరు 14, దుర్వేశి 20, గడిగరేవుల 10, గడివేముల 20, గని 11, కరిమద్దెల 8, కొరటమద్ది 7, కొర్రపోలూరు 10, మంచాలకట్ట 8, ఒండుట్ల 7, పెసరవాయి 10 పింఛన్లను తొలగించినట్లు ఎంపీడీఓ వివరించారు. ఆ లెక్కన ఇతర దివ్యాంగుల వైకల్య పరీక్షలను నిర్వహించి అనర్హుల జాబితాలో ఉన్న వారందరికీ ఈ నెల పింఛన్ ఇవ్వలేదు. ఇదే పరిస్థితి వింతంతు, ఒంటరి మహిళలు, వృద్ధాప్య పింఛన్లలోనూ తలెత్తే అవకాశాలు లేకపోలేదు. వీరందరూ సచివాలయాలు, ఆసుపత్రుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. మంచానికే పరిమితమైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే నలుగురు మనుషులు కావాల్సి వస్తుందని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు.

తిరగని కార్యాలయం లేదు



గడివేముల గ్రామానికి చెందిన దూదేకుల ఉశేని వయస్సు 63 ఏళ్లు. గత కొన్ని ఏళ్ల నుంచి మంచానికే పరిమితమై ఉన్నాడు. గత ఎనిమిదేళ్ల నుంచి పింఛన్ తీసుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం రూ.6 వేల పింఛన్ ఇచ్చింది. ప్రస్తుతం వైద్య పరీక్షల పేరుతో ఈ నెల పింఛన్ రాలేదు. మంచానికే పరిమితమైన ఇతన్ని కుమారుడు, భార్య సపర్యలు చేస్తున్నారు. ఇతన్ని ఎక్కడి తీసుకెళ్లాలన్న నలుగురు మనుషులు ఉండాల్సిన పరిస్థితి. వైద్య పరీక్షల కోసం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి వెళ్లాం అయినా ఫలితం లేదు. పింఛన్ కోసం తిరగని కార్యాలయం లేదంటూ ఆ కుంటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.

–దూదేకుల ఉశేని, గడివేముల

పుట్టుకతోనే మూగ



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ బిలకలగూడూరుకు చెందిన షేక్ పర్వీన్‌బీ పుట్టుకతోనే మూగ, చెవుడు ఉందని భర్త న్యామతుల్లా తెలిపారు. గతంలో ప్రభుత్వ డాక్టర్లు వంద శాతం మూగ ఉందని సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ స్థితిలో నెల రోజుల కిందట వైద్య పరీక్షలకు రావాలని నోటీసు అందింది. వైద్య పరీక్షలకు కర్నూలుకు వెళ్లగా పరీక్షలు నిర్వహించారు. మూగకు చెక్ చేయకుండా చెవుడుకు మాత్రమే చెక్ చేసి పంపారు. ఈ నెల పింఛన్ రూ.6 వేలు కట్ చేశారు. అధికారుల వద్దకు వెళ్లి అడిగితే మా చేతుల్లో ఏమిలేదని తెగేసి చెబుతున్నారని ఆవేదన చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

–షేక్ పర్వీన్‌బీ, భర్త న్యామతుల్లా, బిలకలగూడూరు

మంచానికే పరిమితమైన వారిని మోసం చేయడం తగదు



ఓటు బ్యాంకు కోసం ఆచరణకు సాధ్యం కానీ హామీలను గుప్పించడం అధికారంలోకి వచ్చాక కుట్రలు, సవాలక్ష కొర్రీలతో అర్హులను ఏమార్చి నిలువు నా ముంచడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. గత సార్వత్రిక ఎన్నికల్లో వంద శాతం అంగవైకల్యం ఉండి మంచానికే పరిమితమైన దివ్యాంగులకు రూ.15 వేలు పింఛను ఇస్తామని అనేక బహిరంగ సభల్లో హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దివ్యాంగులు రూ.15 వేల పింఛను కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. దీంతో రీవెరిఫికేషన్ పేరిట అనర్హులుగా ముద్రవేసి వికలాంగ, మంచానికే పరిమితమైన వారి పింఛన్లు తొలగించేందుకు ప్రభుత్వం కుట్రలుతో దివ్యాంగుల నోటి దగ్గరి ముద్దను లాగేయడం దుర్మార్గం –ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, గడివేముల

క్లుప్తంగా

నేడు భూ సమస్యలపై పీజీఆర్ఎస్

సి.బెళగల్: భూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని గ్రామ సచివాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాయింట్ కలెక్టర్ నవ్య, ఆర్డీఓ సందీప్‌ల సమక్షంలో ప్రత్యేక పీజీఆర్ఎస్ జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో రైతులు పట్టాదార్ పాస్ బుక్కులు, ఆన్‌లైన్ అడంగల్ నమోదు, జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు, ఇతర భూ సమస్యలు, రేషన్ కార్డులకు సంబంధించిన ఇబ్బందులపై అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

పరపతి సంఘం భవన పునర్నిర్మాణానికి భూమి పూజ

కర్నూలు(రూరల్): మామిదాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం పునర్నిర్మాణ భూమి పూజ కార్యక్రమం గురువారం మునగాలపాడు గ్రామంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ డి. విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాదాపు రూ.18 లక్షల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఇందులో రైతులకు ఎరువుల సరఫరా గోదాం, గోల్డ్ లోన్, సూపర్ మార్కెట్ వంటి సదుపాయాలను కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీ సీఈవో పి. రామాంజనేయులు, సీడీఓ వెంకటకృష్ణ, మమిదాలపాడు సింగిల్ విండో చైర్మన్ ఎ. సూర్యప్రకాశ్‌రెడ్డి, సొసైటీ సీఈఓ రాజోలీ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆటో కార్మికుల కడుపుకొట్టొద్దు



ధర్నా నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

కోడుమూరు రూరల్: చదువుకున్నా ఉద్యోగాలు రాక ఆటోలు తోలుకుని బతుకీడుస్తున్న ఆటో కార్మికుల కడుపు కొట్టే చర్యలను కూటమి ప్రభుత్వం వెంటనే మానుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శేషుకుమార్ అన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని నిరసిస్తూ గురువారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు కోడుమూరు పాతబస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. శేషుకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది కార్మికులు బ్యాంకులు, ప్రైవేట్ ఫైనాన్స్‌ల నుంచి అప్పులు చేసి ఆటోలను తెచ్చుకుని, వాటిని తోలుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ముందు చూపు లేకుండా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం కారణంగా కార్మికులంతా రోడ్డు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో జగనన్న ఆటో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తే, నేడు కూటమి ప్రభుత్వం వారి సంక్షేమాన్ని విస్మరించిందని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మధు, చిన్న నాగరాజు, దస్తగిరి, రాఘవేంద్ర, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

కోడుమూరు రూరల్: మండలంలోని అమడగుంట్ల గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాలను గురువారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీసీ చైర్మన్ ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మండల అధికారులతో కలిసి కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ రాముడు, సర్పంచ్ వరలక్ష్మి, ఏఓ రవిప్రకాష్, మండల ఇంజినీర్ గంగరాజు పాల్గొన్నారు.

ఎస్సార్బీసీ కాల్వలో యువకుడి గల్లంతు


గల్లంతైన జగదీష్ (ఫైల్)

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ కాల్వలో ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. బేతంచెర్ల మండలం గోరుమానుకొండ చెందిన రామశివుడు, లక్ష్మీదేవి దంపతుల పెద్ద కుమారుడు జగదీష్ మరో నలుగురు కలిసి బుధవారం నంద్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా పాణ్యం సమీపంలో ఎస్సార్బీసీ కాల్వలో స్నానం చేసేందుకు దిగారన్నారు. నీటి ప్రవాహ ఉధృతికి ఇద్దరు కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న హమాలీలు ఒకరిని బయటకు తీశారు. జగదీష్ నీటిలో కొట్టుకుపోయారన్నారు. నీటిలో గల్లంతైన జగదీష్ కోసం కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. జగదీష్ కర్నూల్ సమీపంలో చిన్నటేకూరు వద్ద పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. నంద్యాలలో బంధువులు ఉండటంతో రాఖీ కట్టించుకోవడానికి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

పాణ్యం: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కటిక రాజన్న ఈనెల 8వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. ఆ సమయంలో అమెరికా పర్యటనలో ఉన్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపారెడ్డి ఫోన్ ద్వారా ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ స్థితిలో గురువారం పాణ్యం చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుడి సోదరి అయిన ఎంపీపీ ఉసేన్‌బీ, సోదరుడు బాబు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంచి కార్యకర్తను కోల్పోయామని, ఎన్నికల వేళ రాజన్న పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ కరుణాకరరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు జాకీర్, గౌడ్ తదితరులు ఉన్నారు.

మంచి ప్రభుత్వమంటే పింఛన్ తొలగించడమా ?



ఎంపీడీఓ రఘునాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం మండల నాయకులు

కర్నూలు(రూరల్): మంచి ప్రభుత్వమంటే దివ్యాంగుల పింఛన్‌ను తొలగించడమా ? అని సీపీఎం మండల కమిటీ సభ్యులు ఉసేనయ్య, బాలపీర, రఘువేంద్ర ప్రశ్నించారు. పింఛన్ రద్దు చేస్తున్నామంటూ నోటీసులిచ్చిన ప్రతి దివ్యాంగుడి పింఛన్ వేంటనే పునరుద్ధరించాలని, లేకపోతే దివ్యాంగులు, వితంతు మహిళలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. గురువారం కర్నూలులోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నోటీసులు అందుకున్న దివ్యాంగులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ జి. రఘునాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాట్లడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం అర్థంతరంగా లక్షల మంది పింఛన్ తొలగించడం దుర్మార్గమని విమర్శించారు. మండల వ్యాప్తంగా దాదాపుగా 200 మందికి పింఛన్ రద్దు చేస్తున్నామంటూ నోటీసులిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకట స్వామి, అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ వ్యవహరించిన తీరు సరికాదు

కర్నూలు మండల ఎంపీడీఓ జి.రఘునాథ్ వ్యవహరించిన తీరు సరికాదు అని సీపీఎం నాయకులు విమర్శించారు. పింఛన్ రద్దు నోటీస్‌లు అందుకున్న 40 మంది దివ్యాంగులు గురువారం మండల పరిధి ఆయా గ్రామాల నుంచి నానా కష్టాలు పడి అర్జీలు సమర్పించేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వస్తే వారితో సరిగా మాట్లాడకుండా, తనకు వేరే కార్యక్రమాలు ఉన్నాయని హడవుడిగా అర్జీలు స్వీకరించిన తీరుతో దివ్యాంగులు అందోళన చెందారన్నారు.

రజకులను విస్మరిస్తే ఉద్యమాలే


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రజకులు

సి.బెళగల్: 2024 ఎన్నికల్లో కూటమి పార్టీలు రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాలు తప్పవని జిల్లా రజక వృత్తిదారుల సంఘం నాయకులు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్‌లో జిల్లా రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుణశేఖర్ మండల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు బీసీ వృత్తిదారుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చినట్టు గుర్తు చేశారు. సామాజిక రక్షణ చట్టం, బీసీ కార్పొరేషన్ల ద్వారా రజకుల సంక్షేమం, చెరువులపై హక్కులు, జీఓ నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టుల భర్తీ చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రాల కలెక్టరేట్‌ల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌లో జరిగే ధర్నాలో మండల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల రజక వృత్తిదారుల సంఘం నాయకులు బాలచంద్రుడు, మల్లికార్జున, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, హనుమంతు, వేణుగోపాల్, నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



కల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



కోడుమూరులో తహసీల్దార్‌కు వినతిప్రతం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కల్లూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మధు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల వేతనాలు పెంచడంలో అలసత్వం వహిస్తోందన్నారు. యాప్‌ల ద్వారా పని భారం పెంచుతోందన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు శ్రీధర్, మండలాధ్యక్షుడు షాజహాన్ మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీటీ షర్మిలారెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

గడివేముల: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక పాత బస్టాండు నుంచి తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డీటీ హరికృష్ణ, ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

పాణ్యం: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేపట్టారు. అనంతరం డీటీ శివశంకర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు.

వేతనాలు పెంచాలని ఆందోళన

కోడుమూరు రూరల్: చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న అంగన్‌వాడీ కార్మికులకు ప్రభుత్వం వేతనాలను పెంచాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు గఫూర్‌మియ్యా డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. 2024లో వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి నేతలు నేడు ఆ హామీ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగరాజుకు అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న, అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ నాయకురాలు శూలమ్మ, అరుణ, హైమావతి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

హామీని విస్మరించడం దారుణం


సి.బెళగల్: తహసీల్దార్‌కు సమస్యలను తెలియజేస్తున్న అంగన్‌వాడీలు

సి.బెళగల్: అధికారంలోకి రాకముందు సమస్యలు పరిష్కరిస్తామని, వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన టీడీపీ నేతలు, ఇప్పుడు అధికారంలో ఉన్నా మాట తప్పారని మండల అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సీఐటీయూ డివిజన్ నాయకుడు మోహన్ ఆధ్వర్యంలో సి.బెళగల్ మండల కేంద్రంలో అంగన్‌వాడీలతో సమావేశం జరిగింది. యూనియన్ నాయకురాళ్లు అనంతమ్మ, సరోజమ్మ మాట్లాడుతూ.. గతంలో తాము సమ్మెలు చేసిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేష్ తమ నిరసన శిబిరాలకు వచ్చి వేతనాలు పెంపు, యాప్‌ల తొలగింపు, పనిభారం తగ్గింపుకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికైనా వేతనాలు పెంచి, ఎఫ్ఆర్ఎస్ వంటి యాప్‌లను తొలగించాలని, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ట్యాబ్‌లు అందించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మికి అర్జీని అందజేశారు. కార్యక్రమంలో ఉమా, కళావతి, అన్నమణి, మరియమ్మ, మేరి, హుసేన్‌బీ, ఇంతియాజ్, మహేశ్వరి, శైలజ, రాధమ్మ పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సన్మానం


ఎంపీడీఓ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఏపీఓ సిద్దేశ్వరమ్మ

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీఓ శ్రీనివాసులును గురువారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలో ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా పురస్కారంతో పాటు, ప్రశంసా పత్రం అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ అధికారులు, క్షేత్ర, సాంకేతిక సహాయకులు ఎంపీడీఓ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఏపీఓ సిద్దేశ్వరమ్మ, జేఈ రాజునాయక్, సాంకేతిక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు

సాక్షి ఎఫెక్ట్


గేదెకు టీకా వేస్తున్న డాక్టర్ సాయిహరిణి

గడివేముల: పాడి పశువులు రోగాల బారిన పడకుండా (హెచ్ ఎస్ వ్యాక్సిన్) గొంతువాపు టీకాలు వేస్తున్నట్లు పశువైద్యురాలు డాక్టర్ సాయిహరిణి తెలిపారు. గురువారం 'సాక్షి' దినపత్రిలో 'ఆకస్మికంగా చనిపోతున్న గేదెలు' శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి పశు వైద్యులు స్పందించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పాడి రైతుల ఇంటి వద్దకు వెళ్లి పశువులకు గొంతువాపు టీకాలు వేశారు. ఇప్పటివరకు 200 గేదెలకు టీకాలు వేసినట్లు అధికారులు చెప్పారు. గేదెలకు అనారోగ్యం చేస్తే స్థానిక పశు వైద్య కేంద్రానికి తీసుకు రావాలన్నారు. గేదెలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పశువైద్య సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం మెరుగుపడేలా విద్యాబోధన

కల్లూరు: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా బోధన చేయాలని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాల సీఈఓ డాక్టర్ హరీష్ కృష్ణ సూచించారు. గురువారం దూపాడు సమీపంలోని ఆ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్ మోడ్‌లో జరుగుతుంది. ఈ సందర్భంగా సీఈఓ, అధ్యాపకులు మాట్లాడుతూ ఆధునిక ఇంజినీరింగ్ రంగంలో ఏఐ మార్పులు తెస్తోందన్నారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకుల ద్వారా విద్యార్థులకు చేరడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ ఆర్.నవీన్, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ మాగేశ్వరి, కో–ఆర్డినేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.